క్లుప్తంగా

మూసీనదికి భారీగా వరద


నిండుగా ప్రవహిస్తున్న మూసీనది

అర్వపల్లి : హైదరాబాద్‌తోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జాజిరెడ్డి గూడెం శివారులోని మూసీనదికి వరద భారీగా వస్తోంది. ఇక్కడి నుంచి వరద మూసీ ప్రాజెక్టుకు వెళ్తోంది. భారీగా వరద వస్తుండడంతో ఈ సీజన్‌లో పంటలకు ఇబ్బందులు ఉండవని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర కోశాధికారిగా ఉదయ్



అర్వపల్లి: తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సంఘాల ఆకాంక్షల వేదిక రాష్ట్ర కోశాధికారిగా కొమ్మాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు కదురుపాక ఉదయ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలోపే ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉదయ్‌ను ఆ సంఘం రాష్ట్ర నాయకులు దిర్శనపు కృష్ణమూర్తి, కొణతం కరుణాకర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

నూతన ఎస్‌ఐకి సన్మానం

అర్వపల్లి : అర్వపల్లికి నూతనంగా వచ్చిన ఎస్‌ఐ ఈట సైదులును ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా వీరప్రసాద్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

వేతనాల విడుదలపై హర్షం

అర్వపల్లి: పశుసంవర్ధక శాఖలో పనిచేసే గోపాలమిత్రలకు ఆరు నెలల వేతనాల బకాయిలను విడుదల చేయడం పట్ల తెలంగాణ గోపాల మిత్ర సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆల్దాసు లింగయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం అర్వపల్లిలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ మిఠాయిలు పంచుకున్నారు. మిగిలిన నాలుగు నెలల వేతనాలను కూడా విడుదల చేసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు కుంభం సురేందర్, సురారపు అర్జున్ పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణం విద్యానగర్‌లోని శ్రీరామలింగేశ్వర సహిత త్రిశక్తి, అయ్యప్ప, ఆంజనేయ స్వామి ఆలయంలో ఆషాఢ బహుళ దశమి ఆడి కృతిక సందర్భంగా శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు రెంటాల సతీష్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలతోపాటు పూజలు జరిపారు. స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు అనంతుల సూర్యనారాయణ, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, గణేష్, అర్చకులు దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్య సేవా సమితి సభ్యులు వాస కృష్ణ, తెడ్ల ప్రభాకర్, చెన్నూరు వెంకన్న, గుండా శ్రీనివాస్, మాడుగుల మణికంఠ, రావిరాల సత్యనారాయణ, దండా రవిచందర్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పనులు

అర్వపల్లి : అర్వపల్లిలోని ఎమ్మార్సీ ఆవరణలో ఉన్న భవిత కేంద్రానికి భవన నిర్మాణం కోసం విద్యాశాఖ నుంచి రూ.9.20లక్షలు మంజూరయ్యాయి. దీంతో ఇటీవల భవనం నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఈ భవిత కేంద్రంలో విద్యనభ్యసించనున్నారు. భవనంతోపాటు మరుగుదొడ్ల నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు ఎంఈఓ బాలునాయక్, ఏఈ రంగారావు తెలిపారు.

ప్రమాదకరంగా స్టార్టర్ బాక్స్

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో బొడ్రాయి వద్ద చెట్టుకు వేలాడదీసిన బోరు మోటారు స్టార్టర్ బాక్స్ మూత లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. అయితే బొడ్రాయి కూడలి కావడంతో పిల్లలు ఆ ప్రాంతంలోనే తిరుగుతూ ఆడుకుంటున్నారు. ఆదే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ బోరు మోటారు స్టార్టర్ బాక్స్‌కు మూతను బిగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామ ప్రజలు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


ప్రమాదకరంగా ఉన్న స్టార్టర్ బాక్స్

పారిశుద్ధ్యంపై పట్టింపేదీ..

- అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- దోమల నివారణకు చర్యలు శూన్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఎర్ర సూర్యానాయక్‌తండాలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

చివ్వెంల : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా అస్తవ్యస్త డ్రెయినేజీల కారణంగా ఇళ్ల మధ్య, పరిసర ప్రాంతాల్లోకి చేరుతున్న మురుగు, మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీ వల్ల వీధుల్లో నిలుస్తున్న నీటి వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. దీనికి తోడు రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలు, కంపచెట్లు సమస్యను మరింత తీవ్రం చేస్తున్నాయి. అధికారులు ఈ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య లోపం.. తప్పని తిప్పలు

మండలంలోని చివ్వెంల, వాల్యతండా, జగనాతండా, బద్యాతండా, బి.చందుపట్ల, గుంజలూరు, గుంపుల, ఉండ్రుగొండ, పాండ్యానాయక్, ఎర్ర సూర్యానాయక్ తండా, రాజుతండా, వట్టిఖమ్మంపహాడ్, పులితండా, లక్ష్మణ్‌నాయక్, ఐలాపురం, గాయంవారిగూడెం, మున్యానాయక్ తండా తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిందని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్లపైకి మురుగు నీరు ఇష్టానుసారంగా చేరడం, డ్రెయినేజీల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నప్పటికీ, అధికారులు ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల్లో ఫాగింగ్, బ్లీచింగ్ కరువు..

గ్రామాల్లో మురుగు నీరు నిలిచిన చోట బ్లీచింగ్ చల్లకపోవడం, కనీసం ఫాగింగ్ కూడా చేయకపోవడంతో ఈగలు, దోమలు విచ్చలవిడిగా వ్యాప్తిచెందుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ, వాటిని సక్రమంగా వినియోగించకపోవడం వల్ల తుప్పు పడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు దాటినా ఫాగింగ్ ఎందుకు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని.. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

దోమలతో సతమతం



గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో మురుగు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నాం. డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో వర్షపు నీరు, మురుగు నీరు రోడ్లపై పారుతోంది. దీనికి తోడు పైప్‌లైన్ల లీకేజీ కారణంగా మిషన్ భగిరథ నీరు ప్రవహించి వీధులు కుంటలను తలపిస్తున్నాయి. ఈగలు, దోమలు విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

– రాంబాబు, వట్టిఖమ్మంపహాడ్

మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నాం



గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ యంత్రాలకు బదులు ఆయిల్ బాల్స్ వేస్తున్నాం. అవసరమైన చోట ఎక్కువగా జనాలు సంచరించే ప్రాంతాల్లో ఫాగింగ్ చేపడతాం. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచిస్తున్నాం. ప్రజలు గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా, గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు అందించి సహకరించాలి.

– సీహెచ్. సంతోష్ కుమార్, ఎంపీడీఓ

ఫొటోగ్రాఫర్ల అభ్యున్నతికి నిరంతర కృషి


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

తిరుమలగిరి : రాష్ట్ర ఫొటోగ్రాఫర్ల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్ అన్నారు. ఆదివారం తిరుమలగిరి మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరై మాట్లాడారు. మండల అధ్యక్షుడిగా సుంకరి సుధీర్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కార్యదర్శిగా సాయి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భాస్కర్, ఉపాధ్యక్షుడిగా పరశురాం, కుటుంబ భరోసా ఇన్‌చార్జ్‌గా అర్జున్, కార్యదర్శిగా మహేష్‌కు రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు లాలు నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మాధవరెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు రాం లక్ష్మణ్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా కోశాధికారి బండారు లాలు, తిరుమలగిరి మండల గౌరవ సలహాదారులు కిష్టునాయక్, గంగాధర్, సీనియర్ ఫొటోగ్రాఫర్లు ఆలేటి నారాయణ, సురుగూరి శ్రీనివాస్, మధుకర్ రెడ్డి, నారాయణ, వివిధ మండలాల అధ్యక్షులు, ఫొటోగ్రాఫర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సూర్యాపేట : కోహెన్స్ లైఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేట మండల పరిధిలోని దాసాయిగూడెంలో వస్త్రాంతండా, భానుపురితండా, శాంతినగర్ గ్రామాలకు సంబంధించిన ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోహెన్స్ లైఫ్ సెన్సెస్ ప్రతినిధులు మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతినెలా నిర్వహిస్తామని, వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా మందులు అందిస్తామని తెలిపారు. వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా చాలా అవసరమన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ సీనియర్ మేనేజర్ బి.వెంకటరమణ, మేనేజర్ దుస్సా సైదులు, కోహెన్స్ సిబ్బంది బి.కృష్ణ, బి.జీవన్ నాయక్, ఎస్.వల్లి, మహేష్, మధు, విజయ్, రవి కిరణ్, ప్రభాకర్, సురేందర్, నాగరాజు, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బెతెస్థ మినిస్ట్రీస్ వార్షికోత్సవం


ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

చివ్వెంల : ఖాసీంపేటలోని బెతెస్థ మినిస్ట్రీస్ ప్రార్థన మందిరం 18వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్తుతి గీతాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్, హెప్సిబా, హోప్ చర్చ్ పాస్టర్ రాజేష్ లివింగ్, సీహెచ్ శ్యామ్ ప్రసాద్, బిషప్ ఎంపీహెచ్, ఎస్ మోజెస్, జాటోతు డేవిడ్ రాజు, జలగం జేమ్స్, గుగులోతు బాలాజీ నాయక్, ఏర్పుల క్రిష్టోఫర్, లాజర్, సుందర్, మత్తయ్, ఏలియా రాజ్, జాన్ ప్రకాశ్, యడవల్లి భిక్షం, యేసు పాదం, తీతు, పేతురు, యాకోబ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎర్ర అఖిల్, పాల్గొన్న నాయకులు

చివ్వెంల : విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని కుడకుడ గ్రామ శివారులోని లెనిన్‌నగర్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 23న జరిగే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం విద్యారంగం పట్ల అవలంభిస్తున్న నిర్లక్ష్యం వల్ల పేద విద్యార్థులు చదువులకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు, జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పట్ల నిర్వహిస్తున్న బంద్‌కు పాఠశాల యాజమాన్యాలు, మేధావులు, విద్యార్థులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్, ప్రకాశ్, నవీన్, నితిన్, మధు తదితరుల పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

నూతనకల్ : ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ నాయకుడు పిడమర్తి భరత్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నవీన్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లిలో గోరింటాకు సంబరాలు


చేతులకు పెట్టుకున్న గోరింటాకును చూపుతున్న మహిళలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అర్వపల్లిలో ఆదివారం ఆషాఢం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. పాటలు పాడుతూ ఆషాఢం గోరింటాకు ప్రత్యేకతను తెలియజేశారు.

జీపీ భవనం పనులు పూర్తి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో ఎట్టకేలకు గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 20లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే నిధులు సకాలంలో విడుదల కాకపోవడం, కేటాయించిన నిధులు చాలకపోవడంతో పనుల్లో జాప్యం జరిగింది. మరో రూ.3లక్షలు అదనంగా కేటాయించి మొత్తం రూ.23లక్షలతో పనులను పూర్తి చేశారు. ఈ భవనం ప్రారంభానికి సిద్ధమైందని మాజీ సర్పంచ్ దానం సుజాతయాదగిరి తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదం


కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న షీటీమ్ ఎస్‌ఐ నీలిమ

సూర్యాపేట : విద్యార్థుల ఆత్మ రక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని షీటీం ఎస్‌ఐ నీలిమ అన్నారు. సుమన్ షాటోఖాన్ స్పోర్ట్స్ కరాటే డు అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొంది ప్రతిభ కనబరిచిన కరాటే విద్యార్థులకు ఆదివారం ఆరంజ్, ఎల్లో బెల్టులు, సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కరాటే మాస్టర్ జేవీ రమణను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ జేవి రమణ, మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పస్తాలకు రోడ్డు నిర్మించాలని ధర్నా


కంకరతేలిన రోడ్డుపై ధర్నా చేస్తున్న యువకులు

నాగారం : మండల పరిధిలోని పస్తాల గ్రామానికి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామానికి చెందిన యువకులు పస్తాల–గుండెపురి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పస్తాల గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలిందని, ఈ దారిపై రాకపోకలు సాగించడానికి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో పస్తాల నుంచి గుండెపురి వరకు బీటీ రోడ్డు మంజూరైనా నేటికీ పనులు చేపట్టడంలేదని తెలిపారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బీటీరోడ్డు పనులు చేపట్టాలని, లేనిపక్షంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గాజుల అశోక్, అనిల్, శ్రీకాంత్, వినయ్, సంతు, వికాస్, జాన్, సతీష్, మధు, కృష్ణ, చరణ్, మనోహర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగారం : వర్ధమానుకోటలోని కస్తూరిబాగాంధీ విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారిణి ఎండీ షిరీన్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బైపీపీ, ఎంఎల్‌టీ గ్రూప్‌లలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థినులు ఈ నెల 22 నుంచి 28 వరకు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎస్‌ఓ కల్పన తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంపీసీలో 30 సీట్లు, బైపీసీలో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా 6, 7, 8 తరగతులలో కూడా సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ : 94937 56129 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో ఖాళీగా ఉన్న సీట్లకు పదో తరగతి పాసైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ నాగరాణి ఆదివారం తెలిపారు. ఈ కళాశాలనందు ఎంపీసీలో 20, బైపీసీలో 10సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. అర్హులైన బాలికలు వెంటనే చేరాలని ఆమె పేర్కొన్నారు.

అఖండ ధ్యాన మహాయజ్ఞం


ధ్యానం చేస్తున్న పిరమిడ్ మాస్టర్లు

సూర్యాపేట : అఖండ ధ్యానం వల్ల ఆత్మశుద్ధి, ఆత్మ పరిశీలన, అద్భుతమైన సంకల్ప శక్తి కలుగుతుందని జహీరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రం జమ్మిగడ్డలోని శివ సాయి పిరమిడ్ ధ్యాన మందిరంలో శనివారం నుంచి 24 గంటల పాటు ధ్యానం నిర్వహించి మాట్లాడారు. సూర్యాపేట మొత్తం ధ్యాన జగత్, శాకాహార జగత్ కావాలని తెలిపారు. ఈ ధ్యాన మహాయజ్ఞంలో పిరమిడ్ మాస్టర్లు జ్ఞానేశ్వర్, పాటి సంధ్యారాణి, గాయత్రిలు నిద్ర, ఆహారాలు తీసుకోకుండా 24 గంటల పాటు ధ్యానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివ సాయి పిరమిడ్ ధ్యాన మందిరం అధ్యక్షులు తోట నాగమణి, ప్రధాన కార్యదర్శి గుండా వెంకటేశ్వర్లు, కోశాధికారి చందా విశ్వం, ఉపాధ్యక్షుడు రవి చంద్ర, సహాయ కార్యదర్శి దయా సాగర్, ధ్యానులు వీరబాబు, తోట సత్యనారాయణ, గుండా సువర్ణ, కేదారేశ్వరి, మానుపురు జ్యోతి, సరిత, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు దాతల చేయూత


తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని గట్టికల్ గ్రామానికి చెందిన చిన్నారులు మోరపాక శివ (9), సాయి (4) తమ తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారు. అయితే చిన్నారుల దీన పరిస్థితిని చూసి పలువురు దాతలు వారికి అండగా నిలుస్తున్నారు. ఈ చిన్నారుల తల్లి లక్ష్మి మూడేళ్ల క్రితం క్యాన్సర్ బారిన పడ్డారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో గ్రామస్తులు కొంతమంది సహాయం చేయగా ఆమె చికిత్స పొందింది. కానీ కొన్ని రోజులకే మరణించింది. అప్పటి నుంచి గ్రామస్తులైన రాచకొండ రమేష్, హేమలత దంపతులు ఈ చిన్నారుల బాగోగులు చూసుకున్నారు. దురదృష్టవశాత్తు ఇటీవల చిన్నారుల తాత మోరపాక భిక్షం అనారోగ్యంతో మరణించగా, అదే రోజు రోడ్డు ప్రమాదంలో వారి తండ్రి మోరపాక రాములు కూడా కన్నుమూశారు. దీంతో పూర్తి అనాథలైన ఈ చిన్నారులను ఆదుకోవాలని గ్రామస్తులు సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా దాతలకు విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించి అనేక మంది దాతలు వారికి చేయూత అందించేందుకు ముందుకు వస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చిన్నారులకు రూ. 1,55,000 ఆర్థిక సహాయం అందించింది. రాష్ట్ర విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న జీఎం అండ్ అకౌంట్ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య, ఇన్‌స్పెక్టర్ చెరుకు నాగరాజు, లింగయ్య, రాజు, మహారాజు గట్టికల్‌కు వచ్చి ఈ మొత్తాన్ని చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పిల్లల బాగోగుల కోసం అన్ని రకాల సహాయం అందిస్తామని, ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వారి పాఠశాల ఖర్చులన్నీ తామే భరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులకు, దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్


మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటటౌన్ : శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి కార్డన్ సెర్చ్ ద్వారా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. సైబర్ నేరాలు, గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలు తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. పట్టణంలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటయ్య, రూరల్ సీఐ రాజశేఖర్, పట్టణ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంతాప సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

సూర్యాపేట అర్బన్ : స్వతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డా నారాయణరావు సంతాప సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవనంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దొడ్డా నారాయణరావు నిస్వార్థ ప్రజా సేవకుడు అని, నేటి యువతరానికి ఆదర్శప్రాయుడు అని కొనియాడారు. సోమవారం చిలుకూరు మండల కేంద్రంలో జరిగే సంతాప సభకు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, జిల్లా కార్యవర్గ సభ్యుడు, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొట్ల ప్రభాకర్, మహిళా అధ్యక్షురాలు దేశగాని హేమలత, ఏఐఎస్‌ఎఫ్ గడ్డం నాగరాజు, ప్రజానాట్యమండలి నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

సూర్యాపేట : తమిళనాడు రాష్ట్రంలోని తిరువాణామలైలో జరుగుతున్న అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ సమావేశాలు, జాతీయ కమిటీ ఎన్నికలకు సూర్యాపేట జిల్లా నుంచి జిల్లా అధ్యక్షుడు రంగు ముత్యంరాజు, రాష్ట్ర నాయకుడు భూపతి శ్రీనివాస్ గౌడ్‌ల ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీలలో జరిగిన ఏబీఏపీ జనరల్ బాడీ సమావేశంలో కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. 2025 – 2027 సంవత్సరాలకు గానూ జాతీయ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పీకే మీనన్ జన్మదినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు అయ్యప్ప దాస్, బేతి తీర్మల్ రావు, కోఆర్డినేటర్ రాచర్ల రమేష్, రాష్ట్ర అధ్యక్షుడు పుల్లంరాజు, జిల్లా కార్యదర్శి కొత్తగట్టు యాదగిరి, కోశాధికారి మాశెట్టి నరేష్, కార్యవర్గ సభ్యులు కైరంకొండ రమేష్ పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో సౌరహోమం, ప్రత్యేక పూజలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, మోనూ పాండే, శ్రీరాంపాండే, భక్తులు పాల్గొన్నారు.


సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు